క్లుప్తంగా

వాసవీమాతకు వెండి కిరీటం విరాళం



కిరీటాన్ని విరాళంగా అందజేస్తున్న శ్రీ కన్యకాపరమేశ్వరి దేవి ట్రస్టు నిర్వాహకులు

ఆదోనిఅర్బన్: పట్టణంలోని నగరేశ్వర స్వామి ఆలయంలో వెలిసిన శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి దేవికి ఆ ట్రస్టు వారు మంగళవారం వెండి కిరీటం విరాళంగా అందజేశారు. ఈ మేరకు స్థానిక నగరేశ్వర స్వామి ఆలయంలో ట్రస్టు సభ్యులు రాచోటి రఘురాం, రాచోటి విశ్వనాథ్, రాచోటి సుబ్బయ్య 728 గ్రాముల వెండి కిరీటాన్ని ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష కార్యదర్శులు బి.టి.ప్రకాష్, వేణుగోపాల్, జిల్లా అధ్యక్షుడు బద్రినాథ్‌లకు అందజేశారు. ట్రస్టు సభ్యులు మాట్లాడుతూ.. తమ ట్రస్టు దినదినాభివృద్ధి చెందుతుండడం వల్ల అమ్మవారికి తమ వంతుగా వెండి కిరీటం అందించామని చెప్పారు. ఆర్యవైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు విగ్రహానికి క్షీరాభిషేకం



పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం సభ్యులు

ఆదోనిఅర్బన్: ఆంధ్ర రాష్ట్ర అవతరణ పితామహుడు, అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆర్యవైశ్య సంఘం సభ్యులు మంగళవారం క్షీరాభిషేకం చేశారు. స్థానిక ఎంఎం రోడ్డులోని అమరజీవి విగ్రహానికి మూడు రోజులక్రితం మతిస్థిమితం లేని వ్యక్తి అపుద్ధి చేయడంతో దానిని తొలగించి విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఆ సంఘం అధ్యక్ష కార్యదర్శులు బి.టి.ప్రకాష్, వేణుగోపాల్, జిల్లా అధ్యక్షులు బద్రినాథ్ మాట్లాడుతూ మతిస్థిమితం లేని వ్యక్తి చేసిన పనిని రాజకీయ కోణంలో చూడరాదన్నారు. సభ్యులు టి.జి.రాంప్రసాద్, సుబ్రహ్మణ్యం, రంగన్న, విశ్వనాథ్, శ్రీధర్, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కోసిగి ఏపీఓగా చంద్రశేఖర్



మురళీమోహన్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసిన ఏపీఓ చంద్రశేఖర్

కోసిగి: మండల జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఏపీఓగా చంద్రశేఖర్ బదిలీపై వచ్చి బాధ్యతలు చేపట్టారు. మంగళవారం కోసిగి తహసీల్దార్ కార్యాలయంకు వచ్చిన వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీ మోహన్ రెడ్డిని ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కోసిగి మండలంలో ఉపాధి హామీ పథకం కింద కూలీలకు అవగాహన కల్పించి అడిగిన వారందరికీ పనులు కల్పించాలని సూచించారు. వలసల నివారణకు కృషి చేయాలన్నారు. తహసీల్దార్ రుద్రగౌడ, ఆదోని క్లస్టర్ టెక్నికల్ అసిస్టెంట్ గిడ్డయ్య ఉన్నారు.

సేంద్రియ వ్యవసాయంపై అవగాహన



ర్యాలీకి సిద్ధమైన విద్యార్థులు

ఆదోనిసెంట్రల్: మాలపల్లి జీవదాయక వ్యవసాయ క్షేత్రంలో గత ఆరు రోజులుగా కొనసాగుతున్న ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల జాతీయ సేవా పథకం వారి ప్రత్యేక శిబిరం కొనసాగుతోంది. అందులో భాగంగా మంగళవారం మాలపల్లి, రచ్చుమర్రి మీదుగా మాధవరం వరకు 13 కి.మీ పాదయాత్ర చేసినట్లు క్షేత్రం డైరెక్టర్ డాక్టర్ డేనియల్ ప్రేమ్‌కుమార్ తెలిపారు. ఈ పాదయాత్రను మాలపల్లి సర్పంచ్ సీతారామిరెడ్డి ప్రారంభించగా సేంద్రియ వ్యవసాయ ముఖ్య ఉద్దేశంగా ఆయా గ్రామాల్లో కరపత్రాలను పంపిణీ చేస్తూ అవగాహన కల్పించారు. ఎన్ఎస్ఎస్ డివిజన్ అధికారి జొనాథన్ విక్లీఫ్, మాధవరం హైస్కూల్ టీచర్లు నీలకంఠం, సరిత, నాగరాజు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీలో చోటు

ఆదోనిఅర్బన్: ఆదోని సబ్ డివిజన్ పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీలో ఎరుకల హక్కుల పోరాట సమితి కర్నూలు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎరుకల రవికుమార్ మంగళవారం నియమితులయ్యారు. ఎస్టీ కోటాలో ఆదోని సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ ఎరుకల రవికుమార్‌కు అవకాశం కల్పించి నియామక పత్రం అందజేశారు. ఈయన నియామకం పట్ల ఆదోని డివిజన్ పరిధిలోని ఎరుకల గిరిజనులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్‌కు పూలమాలలు, దుశ్శాలువాలు వేసి రవికుమార్ సన్మానించారు.

విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు

- ఇచ్చిన హామీలను వంద శాతం నెరవేర్చిన ఘనత జగనన్నదే
- 24వ వార్డు శంకర్‌నగర్‌లో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం

ఆదోనిరూరల్: పిల్లలకు ఇచ్చే తరగని ఆస్తి విద్య అని భావించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు అహర్నిశలు కృషి చేశారని, ఇచ్చిన హామీలను వంద శాతం నెరవేర్చిన ఘనత జగనన్నకే దక్కిందని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఆదోని పట్టణంలోని 24వ వార్డు శంకర్‌నగర్‌లో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే పాల్గొని ప్రతి గడపకు తిరుగుతూ వార్డులోని సమస్యలను తెలుసుకుని వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజల కష్టాలు తీర్చేందుకు పుట్టిన పార్టీ వైఎస్సార్‌సీపీ అని, ప్రజా సంకల్పయాత్రలో ప్రజలకు మాట ఇచ్చిన ప్రకారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమ్మ ఒడి, విద్యాదీవెన వసతి దీవెన, విదేశీ విద్య, నాడు-నేడు కింద పాఠశాలల సుందీకరణ చేస్తూ పిల్లలందరూ బడిలోనే ఉండాలని, పనిలో కాదని విద్యాభివృద్ధికి పెద్దపీట వేశారని వివరించారు. ప్రభుత్వ పథకాలతో నేడు వంద శాతం మంది పిల్లలు బడులకు వెళ్తున్నారన్నారు. అలాగే తండ్రి ఆశయాలకు అనుగుణంగా ఆరోగ్యశ్రీ పరిధిని రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచారని వివరించారు. గత టీడీపీ ప్రభుత్వం దోపిడీనే లక్ష్యంగా అన్ని వర్గాల ప్రజలను దోచుకుందని ఆరోపించారు. రెండెకరాల ఆస్తితో రాజకీయాల్లోకి వచ్చిన చంద్రబాబునాయుడు నేడు లక్షల కోట్లకు పడగలెత్తారన్నారు. ప్రజాధనాన్ని లూటీ చేసి జేబులో వేసుకున్నారని మండిపడ్డారు. నేడు ఆరు అబద్ధాలతో మేనిఫెస్టోను విడుదల చేసి ప్రజలను మభ్యపెట్టేందుకు చూస్తున్నారని ఎవరూ నమ్మవద్దన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు ఓటుతో చంద్రబాబుకు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. సంక్షేమ పాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి అఖండ మెజార్టీతో గెలిపించుకుందామని ప్రజలను కోరారు. ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షులు బి.దేవా, మున్సిపల్ చైర్‌పర్సన్ బి.శాంత, రేణుక, మంజుల, శ్రీలక్ష్మి, చంద్రకాంత్‌రెడ్డి, వార్డు ఇన్‌చార్జి మాధవరెడ్డి, వీరభద్రరెడ్డి, నాగేంద్ర, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, పోలీసు, సచివాలయం, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



శంకర్‌నగర్‌లో లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి

పరిశ్రమల సందర్శన



విద్యుత్ సబ్‌స్టేషన్‌లో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మంత్రాలయం: ఇండస్ట్రియల్ విజిట్‌లో భాగంగా మండలంలోని రచ్చుమర్రి గ్రామంలోని ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థుల (ఐటీ, ఎలక్ట్రానిక్స్)కు పలు విషయాలపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. మంగళవారం పాఠశాలకు చెందిన వృత్తి విద్యా శిక్షకులు రవి, పాంపయ్య ఆధ్వర్యంలో పరిశ్రమల సందర్శన చేపట్టారు. మాధవరం 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్, కోసిగి గ్రామ సచివాలయం, కంప్యూటర్ కేంద్రం, ఆధార్ సేవా కేంద్రాల పనితీరుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రసాద్ మాట్లాడుతూ వృత్తి విద్యాకోర్సుల్లో నైపుణ్యం పెంచాలనే ఉద్దేశంలో పారిశ్రామిక సందర్శన చేపట్టినట్లు పేర్కొన్నారు. వైస్ ప్రిన్సిపాల్ నళిని, ఉపాధ్యాయులు సోఫియా బానూ, రాజశేఖర్, మన్సూర్, ప్రవీణ్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

విద్యార్థి జీవితంలో ఇంటర్మీడియెట్ దశ కీలకం

కోసిగి: విద్యార్థి జీవితంలో ఇంటర్మీడియెట్ దశ కీలకమని, కష్టపడి చదివి అనుకున్న లక్ష్యాలను సాధించాలని కోసిగి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు సూచించారు. మంగళవారం స్థానిక కళాశాలలో ఫేర్‌వెల్ డే నిర్వహించారు. మంత్రాలయం,కౌతాళం, ఆస్పరి మండలాలలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు కె.రమేష్, సంతోష్, లక్ష్మీనారాయణ హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం సరస్వతి దేవి చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. అతిథులు మాట్లాడుతూ.. జీవితంలో ఉన్నత స్థాయిలో రాణించాలంటే ఇంటర్మీడియెట్‌లో కష్టపడి చదవాలన్నారు. లేకపోతే భవిష్యత్తులో ఎన్నో ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. విద్యార్థులకు నిర్వహించిన కబడ్డీ, క్రికెట్ పోటీల్లో విజేతలుగా నిలిచిన జట్లకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం విద్యార్థులు, డ్యాన్స్, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అధ్యాపకులు పాల్గొన్నారు.



మెడల్స్ అందుకున్న విద్యార్థులతో ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, అధ్యాపక బృందం

నిత్యావసర సరుకుల అందజేత

మంత్రాలయం: మండల పరిధిలోని చిలకలడోణ గ్రామంలో గోనెపోగు కుమార్, ప్రశాంతి దంపతులు అనారోగ్యంతో మృతి చెందడంతో వారి ముగ్గురు పిల్లలు అనాథలయ్యారు. మంగళవారం జైభీమ్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వ్యవస్థాపకులు చిక్కం జానయ్య మాదిగ గ్రామంలో పర్యటించారు. కుమార్ ఎనిమిదేళ్ల క్రితం చనిపోగా, ప్రశాంతి ఈనెల 22వ తేదీన అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఆయన పిల్లల పోషణ నిమిత్తం 25 కేజీల బియ్యం, 6 కేజీల బ్యాళ్లతో పాటు నిత్యావసర సరుకులు అందించారు. ప్రభుత్వం వారికి పెన్షన్, రెండెకరాల పొలం, 2 సెంట్ల ఇంటి స్థలం ఇచ్చి ఆదుకోవాలని కోరారు. అలాగే దాతలు ఆనాథ చిన్నారులకు సాయం అందించాలని పిలుపునిచ్చారు. జైభీమ్ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ముత్తు సుమాల మాదిగ, మంత్రాలయం అధ్యక్షులు గాడిమోడి నరసింహ, గ్రామ నాయకులు గుండుపోగుల ఆదాము, బోయ వీరేష్ తదితరులు పాల్గొన్నారు.



నిత్యవసర సరుకులు అందజేస్తున్న జైభీమ్ ఎమ్మార్పీఎస్ నాయకులు

మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలి

ఆదోనిఅర్బన్: శ్రీ మహాయోగి లక్ష్మమ్మ కో-ఆపరేటివ్ బ్యాంకు వారి ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణ కేంద్రంలో శిక్షణ పూర్తి చేసుకున్న 74 మంది మహిళలకు సర్టిఫికెట్ల ప్రదాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆదోని డీఎస్పీ శివనారాయణస్వామి, ఆయన సతీమణి పాల్గొన్నారు. బ్యాంకు అధ్యక్షులు రాయచోటి సుబ్బయ్య మాట్లాడుతూ.. కుట్టు శిక్షణా సంస్థ ద్వారా ఇప్పటివరకు 2,122 మంది స్త్రీలు టైలరింగ్ నేర్చుకున్నారని వివరించారు. డీఎస్పీ మాట్లాడుతూ.. మహిళలకు డిజైనింగ్, ఎంబ్రాయిడింగ్ ఇతర వృత్తులపై టెక్నీషియన్ల ద్వారా ట్రెనింగ్ ఇవ్వడం శుభపరిణామన్నారు. అనంతరం సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. బ్యాంకు ఉపాధ్యక్షులు బి.లక్ష్మయ్యశెట్టి, డైరెక్టర్లు సుధాకర్‌శెట్టి, దినకర్ పాటిల్, శ్రీనివాసులు, అశ్వత్ నారాయణ, తదితరులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్లను అందజేస్తున్న డీయస్పీ శివనారాయణస్వామి దంపతులు

సబ్‌కలెక్టర్ తనిఖీ

ఆదోనిరూరల్: ఎన్నికలు సమీపిస్తున్న దృష్ట్యా పోలింగ్ కేంద్రాలపై పర్యవేక్షణ అవసరమని ఆదోని సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ అన్నారు. మంగళవారం మండలంలోని బాలికల కళాశాల పోలింగ్ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం సౌకర్యాలు కల్పించాలని డీటీ ఎజాజ్‌అహ్మద్‌కు సూచించారు. అనంతరం పట్టణంలోని అంబేడ్కర్ నగర్‌లో ఓటర్ జాబితాపై విచారణ చేపట్టారు. నకిలీ ఓట్లు లేకుండా చూడాలని ఎన్నికల అధికారులను ఆదేశించారు. ఓటర్ జాబితాలో లోపాలు లేకుండా పటిష్టమైన జాబితా తయారు చేయాలని బీఎల్‌ఓను ఆదేశించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని మెచ్చరించారు. ఈయన వెంట సూపర్‌వైజర్, బీఎల్‌ఓలు ఉన్నారు.



ఈవీఎం మిషన్‌ను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్

జాతిపితకు ఘన నివాళి

ఆదోనిఅర్బన్: ఆదోని ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా) ఆధ్వర్యంలో మంగళవారం జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. స్థానిక మున్సిపల్ పార్కులోని గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గాంధీజీ చేసిన త్యాగాలను, ఆశయాలను కొనియాడారు. ప్రజాసేవలో భాగంగా ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలోని చిన్నారులకు, రోగులకు పండ్లు, బ్రెడ్లు అందజేశారు. కార్యక్రమంలో ఆదోని అవోపా ప్రెసిడెంట్ వంకదారు శ్రీనాథ్‌గుప్తా, కార్యదర్శి మిర్యాల శ్రీధర్, సభ్యులు రఘు, రాజేష్, రాము, సనత్, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు

కోసిగి: కోసిగి పోలీస్ స్టేషన్‌లో జాతిపిత మహాత్మ గాంధీ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం ఏఎస్ఐ నాగరాజు ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నారికేళాలు సమర్పించి నివాళులర్పించారు. ఆయన త్యాగాలను స్మరించుకున్నారు. హెడ్ కానిస్టేబుల్ ఆచారి, కానిస్టేబుల్ తిప్పన్న పాల్గొన్నారు.

కుక్కల బెడద నుంచి కాపాడండి

- సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చిన కౌన్సిలర్లు
- పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అధికారుల హామీ



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ బోయ శాంత

ఆదోనిఅర్బన్: పట్టణంలోని 5వ వార్డుతో పాటు చుట్టుపక్కల కాలనీవాసులకు కుక్కల బెడద తీవ్రస్థాయిలో ఉందని, వాటి నుంచి కాపాడాలని కౌన్సిలర్ రఘునాథ్‌రెడ్డి మున్సిపల్ అధికారులకు విన్నవించారు. మంగళవారం మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో చైర్‌పర్సన్ బోయ శాంత ఆధ్వర్యంలో కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు సమస్యలను సభాదృష్టికి కౌన్సిలర్లు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా 5వ వార్డు కౌన్సిలర్ రఘునాథ్‌రెడ్డి మాట్లాడుతూ కాలనీలో కుక్కలకు సంతానం కలగకుండా చేసి అక్కడే వదులుతున్నారని, దీనివల్ల చుట్టుపక్కల ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. అలా చేయకుండా కుక్కలకు ఆపరేషన్ చేసి 20 కి.మీ. దూరంలో వదలాలని కోరారు. స్పందించిన శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ హరి మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉన్నతాధికారుల దృష్టికి విషయాన్ని తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కుక్కలను చంపరాదని ఆదేశాలు ఉన్నాయని, వాటిని దూరంగా తరలించేలా చూస్తామన్నారు. అనంతరం కౌన్సిలర్ నాగరత్నమ్మ మాట్లాడుతూ.. నీరు, ఇంటి పన్ను డీడీ రూపంలో ప్రజలు చెల్లిస్తున్నారని, మున్సిపల్ అధికారులు మాత్రం వాటిని తీసుకోవడం లేదని చెప్పారు. పాత బకాయిలు ఉండడం వల్ల డీడీలను అనుమతించడం లేదని, పాత బకాయిలు లేకుంటే డీడీలను అనుమతిస్తామని మున్సిపల్ అధికారులు తెలిపారు. కౌన్సిలర్ చలపతి మాట్లాడుతూ.. కొత్త బస్టాండు వద్ద పెద్ద కాలువ ఉందని, స్థానిక హోటల్, దుకాణదారులు కాలువలో చెత్తాచెదారం వేయడం వల్ల చెత్తతో నిండిపోయిందని, దీనివల్ల లోతట్టు కాలనీల్లో మురుగు కాలువ నిండి దోమలబెడద అధికమైందన్నారు. కాలువలో పూడిక తీసి చెత్తాచెదారం వేయకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం అజెండాలో ఉన్న అంశాలను చదవడంతో కౌన్సిలర్లు ఏకగ్రీవంగా ఆమోదించారు. మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి, డీఈ నాగభూషణం రెడ్డి, ఏఈ రాజశేఖర్ రెడ్డి, అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీనివాసులు, వైస్ చైర్మన్ గౌస్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి

కౌతాళం: ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సుబ్బరాజు సూచించారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా మంగళవారం మండల పరిధిలోని అగసలదిన్నె, కాత్రికి గ్రామాల్లో యాత్రను చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. పీఎం ఆయుష్మాన్ భారత్, గరీబ్ కళ్యాణ్, పోషణ అభియాన్, దీన దయాల్ అంత్యోదయ యోజన, మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, పీఎం విశ్వకర్మ యోజన, అవాజ్ యోజన, ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు, జన్‌ధన్‌యోజన, జల్‌జీవన్ మిషన్, స్వచ్ఛభారత్, పశువులకు వాక్సినేషన్ తదితర పథకాలపై అవగాహన కల్పించారు. ముందుగా ప్రతిజ్ఞ చేయించారు. ఆయుష్మాన్ కార్డులను పంపిణీ చేశారు. ఆయా గ్రామాల కార్యదర్శులు, వీఆర్ఓలు, వలంటీర్లు, పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. ఐదుగురికి గాయాలు



ఘటనా స్థలంలో క్షతగాత్రుడు

ఆదోనిరూరల్: మండలంలో మాధవరం నుంచి ఆదోనికి వెళ్తున్న ఓ ఆటో కుప్పగల్ క్రాస్ రోడ్డు వద్ద మంగళవారం మధ్యాహ్నం కుక్క అడ్డురావడంతో తప్పించబోయి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ రాజుతోపాటు ఐదుగురికి గాయాలయ్యాయి. అటుగా వెళ్తున్న వారు వారిని 108 అంబులెన్స్ ద్వారా ఆదోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంపై పెద్దతుంబళం ఎస్ఐ చిన్నపీరయ్యను విచారించగా విషయం తమ దృష్టికి రాలేదని తెలిపారు.

కర్ణాటక మద్యం తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్

ఆదోనిరూరల్: మండలంలోని ఆదోని-సిరుగుప్ప రోడ్డు చిన్నహరివాణం తుంగభద్ర దిగువ కాలువ వద్ద అక్రమంగా కర్ణాటక మద్యం రవాణా చేస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి మంగళవారం విలేకరులకు తెలిపారు. పెద్దకడబూరు మండలం తారాపురం గ్రామానికి చెందిన బోయ కొండయ్య, ఆదోని పట్టణంలోని అమరావతినగర్‌కు చెందిన శెట్టి బలిజ రాఘవేంద్ర రెండు మోటార్ సైకిళ్లపై 1152 మద్యం టెట్రా ప్యాకెట్లు (12 బాక్సులు) తరలిస్తూ పట్టుబడ్డారన్నారు. వారి వద్ద నుంచి మద్యం బాక్సులు, రెండు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. అక్రమ మద్యం సరఫరాపై ఉక్కుపాదం మోపుతామన్నారు. నిందితులు ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఈ దాడుల్లో ఇన్‌స్పెక్టర్ ఎస్ఐ శ్రీనివాసులు, సిబ్బంది నీలకంఠ, సుదర్శన్, రూరల్ హెచ్‌సీ నాగరాజు, పెద్దతుంబళం కానిస్టేబుల్ సుధాకర్ పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి, పోలీసులు

వ్యాయామంతో ఆరోగ్యం

ఆదోనిఅర్బన్: ప్రతిఒక్కరూ రోజూ వ్యాయామం చేయాలని జిల్లా పవర్ లిఫ్టింగ్, బాడీ బిల్డింగ్ చైర్మన్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆదోనిలో జపాలి జిమ్ నిర్వాహకులు సాకర్ శ్రీనివాస్ నిర్వహించిన జిల్లా పవర్ లిఫ్టింగ్, బాడీ బిల్డింగ్ పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కునిగిరి నీలకంఠ మాట్లాడుతూ.. దేశ ప్రజలంతా బలంగా ఉంటేనే దేశం బలంగా ఉంటుందన్నారు. వ్యాయామాన్ని దినచర్యగా భావించాలని సూచించారు. అనంతరం పోటీల్లో గెలిచిన ఖాదర్‌బాషాకు మొదటి బహుమతి, అబ్దుల్ బాషాకు రెండో బహుమతి, మితిన్‌కు మూడో బహుమతిని అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో మాధవ్, సాకర్ ఈరన్న, ఈరన్నరావు, మహబూబ్‌బాషా, కేశవ మాస్టర్, గోవిందరావు, వాల్మీకి మంజునాథ్, గోవిందరాజ్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న కునిగిరి నీలకంఠ

ప్రజారోగ్యమే సురక్ష ధ్యేయం

కోసిగి: రాష్ట్ర ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యమని ఎంపీపీ ఈరన్న పేర్కొన్నారు. మంగళవారం కోసిగి సచివాలయం-4 పరిధిలోని ప్రజలకు జగనన్న ఆరోగ్య సురక్ష -2 వైద్య శిబిరం డాక్టర్లు మనోజ్, నజీర్ అహ్మద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రజల ఆరోగ్య క్షేమం కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆహర్నిశలు కృషి చేస్తున్నాడన్నారు. సచివాలయం పరిధిలో వివిధ వ్యాధులతో పడుతున్న వారు ఓపీ ద్వారా వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ప్రధానంగా రక్త పరీక్ష, డయాబెటీస్, మలేరియా, హెబీ పరీక్షలు చేసి మెరుగైన వైద్యం అవసరమైన వారిని ఆరోగ్య శ్రీ ద్వారా కర్నూలుకు రెఫర్ చేశారు. అలాగే ఉచితంగా కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి కంటి అద్దాలు అందించేందుకు పేర్లు నమోదు చేసుకున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మాణిక్యరాజు, మహంతేష్ స్వామి, నాగరాజు, అయ్యప్ప, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



కోసిగి సచివాలయం-4లో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

అద్వితీయం.. ఆచారాల పర్వం

- సులేకేరిలో వైభవంగా బనశంకరీ కుంభోత్సవం
- శూన్య అమావాస్య నుంచి భక్తులు పాలు, పెరుగుకు దూరం
- గ్రామ చావిడిలో పాదరక్షలతో ప్రయాణం నిషేధం
- పత్రి సోమవారం వృషభాలకు సెలవుదినం



పూజలందుకుంటున్న బనశంకరీదేవి



కుంభాలతో ఊరేగింపుగా వస్తున్న భక్తులు

కౌతాళం: సంప్రదాయం కొనసాగింది. సంబరాలతో నేత్రానందం పంచింది. అనాది కట్టుబాట్లకు నిలువెత్తు సాక్ష్యమై కనువిందు చేసింది. కౌతాళం మండలం సులేకేరి గ్రామంలో సాగిన ఆచారాల పర్వం విశేషాలు ఇవిగో..

బనశంకరీ ఆజ్ఞయే శాసనం

దాదాపు 400 ఏళ్ల క్రితం బనశంకరీ దేవి అనే అవధూత ఉండేది. అవ్వ మహిమలతో గ్రామాన్ని సల్లగా చూస్తూ వచ్చింది. అవ్వ సూచనలు ఆ గ్రామానికి ఆచారంగా మారాయి. అవ్వ ఆజ్ఞ మేరకు నేటికీ గ్రామస్తులు కాడెద్దులకు ప్రతి సోమవారం సెలవు ఇస్తారు. ఇళ్లతోనే ఉంచి స్నానాలు చేయించి, పూజలు చేస్తారు. అలాగే శూన్య అమావాస్య నుంచి గ్రామస్తులు ప్రత్యేక ఆచారాలు పాటించడం ఆనవాయితీగా వస్తోంది. సదరు కార్తె నుంచి గ్రామస్తులు పాలు తాగిన రోజు పెరుగు తినరు. పెరుగు తిన్న రోజు పాలు తాగరు. కార్తె నుంచి ఇక్కడ వెన్నను తీసి అలాగే ఉంచుతారు. నెయ్యి చేయరు. అలాగే వరిబియ్యం, కొర్రబియ్యం కలిపి అన్నం చేసుకోరు. కుంభాలు వెళ్లిన వాళ్ల ఇళ్లలో కొర్ర అన్నం చేసినా పాలాల్లో చల్లులు కలుపుకుని భుజించరు. మాసాంహారం తీసుకోరు. అవ్వ జాతర మహోత్సవం వరకు మూడు నెలల పాటు ఇదే ఆచారం పాటిస్తారు. అవ్వ జాతర ముగియగానే ఆహార కట్టుబాట్లకు ఇక్కడ స్వస్తి పలుకుతారు. సోమవారం ఎద్దులకు సెలవు మాత్రం నిరంతర ప్రక్రియగా కొనసాగిస్తారు.

కమనీయం.. కుంభోత్సవం

గ్రామంలో మంగళవారం బనశంకరీదేవి (బంధమ్మవ్వ) వేడుకలు కమనీయంగా జరిగాయి. వేడుకల్లో భాగంగా సోమవారం బంధమ్మవ్వ ప్రభోత్సవం కానిచ్చారు. మంగళవారం కుంభోత్సవంలో భాగంగా గ్రామంలో ప్రతి ఇంటి నుంచి కుంభాలతో ఊరేగింపు చేపట్టారు. కలశాలు, డప్పు దరువులు, విన్యాసాలు మధ్య ఎంతో వైభవంగా వేడుకలు సాగాయి. గ్రామ వీధులన్నీ కుంభాలతో కనువిందు చేశాయి. ఆచారంలో భాగంగా అవ్వకు వరి బియ్యం, కొర్ర బియ్యం, పాలు, పెరుగు, వెన్నతో చేసిన నైవేద్యాలు సమర్పించారు. గ్రామంలో సంగీత విభావరి, చెక్కభజనలు నిర్వహించారు. వేడుకలను తిలకించేందుకు కర్ణాటక, ఆంధ్ర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు.

పరామర్శ

కోసిగి: ఆర్లబండ సహకార పరపతి సంఘం అధ్యక్షుడు నాడుగేని నరసింహులు మధుమేహ వ్యాధితో బాధపడతూ కర్నూలులోని ఓ హాస్పిటల్‌లో శస్త్రచికిత్స చేయించుకుని ఇంటికి చేరుకున్నాడు. మంగళవారం వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీ మోహన్ రెడ్డి ఆయన్ను ఇంటి వద్ద కలిసి పరామర్శించాడు. ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. త్వరలో కొలుకుని పార్టీ కార్యక్రమాల్లో విస్తృతంగా పాల్గొనాలని కోరారు. ఆయన వెంట ఎంపీపీ ఈరన్న, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బెట్టన గౌడ, కామన్‌దొడ్డి నరసింహులు గౌడ, బుజ్జి నరసింహులు, సోఫీ, కందుకూరు రమేష్, రామన్న, గౌస్‌ఖాన్‌లు ఉన్నారు.

జన ఔషధి కేంద్రం ప్రారంభం

కౌతాళం: మండల కేంద్రంలో బుధవారం జన ఔషధి కేంద్రాన్ని ప్రారంభించనున్నట్లు కౌతాళం సహకార సంఘం సీఈఓ వెంకటేష్ తెలిపారు. 'ఒకరి కోసం అందరు - అందరి కోసం ఒకరు' నినాదంతో సాగుతున్న కౌతాళం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో ఈ కేంద్రం ప్రారంభిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఇక్కడ 50 శాతం తక్కువ ధరకే ఔషధాలు దొరుకుతాయన్నారు.